ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి



సర్పంచి సొంత నిధులతో రహదారి ఏర్పాటు

ప్రజాశక్తి-గుడిబండ



రహదారి పనులు చేయిస్తున్న సర్పంచి సతీష్ బాబు

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని దేవరహట్టి పంచాయతీ పరిధిలోని పలారం గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. గుడిబండ నుంచి పలారం గ్రామం మీదుగా రొళ్ల మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో రోజూ వందలాది ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో దేవరహట్టి పంచాయతీ సర్పంచి సతీష్ సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తోలించి రహదారిని పునర్నిర్మించారు. సర్పంచి ఉదార స్వభావం పట్ల గ్రామస్తులే కాక వివిధ ప్రాంతాల వాహనదారులు ప్రశంసిస్తున్నారు.

వీరుడా..వీడ్కోలిక..!





సైనిక లాంఛనాలతో గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ సిబ్బంది.. అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

- అశ్రునయనాల మధ్య జవాను అంత్యక్రియలు
- సైనిక లాంఛనాలతో తుదివీడ్కోలు
- తరలివచ్చిన నార్పల ప్రజానీకం
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

రెండు రోజుల క్రితం జమ్ముకాశ్మీర్‌లో ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను సుబ్బయ్య అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య గురువారం ముగిశాయి. కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. చివరిసారిగా జవాన్ సుబ్బయ్య పార్థివదేహాన్ని చూసేందుకు నార్పల నుంచే కాకుండా చుట్టపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువత తరలొచ్చారు. జవాను నివాసం నుంచి అంత్యక్రియలు జరిగే తోట వరకు సాగిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో యువత జాతీయ జెండాలను పట్టుకుని పాల్గొన్నారు. ఆర్మీ అధికారులు, శింగనమల ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, అధికారులు జవాన్ సుబ్బయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆర్మీ అధికారులు గౌరవ వందనం సమర్పించి.. సైనిక లాంఛనాలతో జాతీయ జెండాను జవాన్ సతీమణి, తల్లికి అందించారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియల కార్యక్రమాన్ని ముగించారు.

ప్రజాశక్తి-నార్పల

ఈ నెల 9న జమ్ము పూంచ్ సెక్టార్‌లో సైనిక విధుల్లో పహారా కాస్తూ తన తోటి 30 మంది సైనికుల ప్రాణాలను కాపాడి, ల్యాండ్‌మైన్ పేలిన ఘటనలో వీరమరణం పొందిన జవాన్ వరికుంట్ల సుబ్బయ్య అంత్య క్రియలు గురువారం తన భార్య, పిల్లలు నివాసం ఉంటున్న నార్పలలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. జవాను సొంత వ్యవసాయ భూమిలో సైనిక లాంఛనాలతో కుటుంబ సభ్యులు, బంధువులు, యువత మధ్య సైనికాధికారులు అంత్యక్రియలను పూర్తి చేశారు. జవాన్ సుబ్బయ్య అంతిమ యాత్రలో పాల్గొనడానికి మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో నార్పలకు చేరుకుని అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆర్డీవో కేశవ నాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు వీరజవాన్ పార్థివ దేహం వద్ద పూలదండలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. జవాను సుబ్బయ్య భార్య లీలావతి, తల్లి గాలెమ్మ, పిల్లలు సాయి, లాస్య ప్రియ, సుబ్బయ్య అత్తామామలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప తదితరులు పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



రోధిస్తున్న జవాను భార్య లీలావతి

అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

ఇంటి నుంచి మిలిటరీ వాహనంలో జవాను సుబ్బయ్య అంతిమ యాత్ర కొనసాగింది. మృతుని తోటలో వారి ఆచారం ప్రకారం అంతిమ సంస్కారాలు పూర్తయిన తరువాత మిలటరీ హానర్స్ ప్రకారం వీరజవానుకు కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంతిమ నివాళులు అర్పించారు. అనంతరం పార్థివ దేహంపై కప్పి ఉంచిన జాతీయ జెండాను సైనిక అధికారులు జవాన్ తల్లి, భార్యకు ఉద్విగ్న పూర్వక వాతావరణంలో అందించారు. వీర జవాన్ సుబ్బయ్య "అమర్ రహే" అంటూ ప్రజలు నినాదాలు చేస్తుండగా 14 మంది ఆర్మీ సైనికులు మూడు రౌండ్లు చొప్పున మొత్తం 52 రౌండ్లను గాల్లో పేల్చి అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, రాయలసీమ, ప్రకాశం, బళ్లారి జిల్లాల నుంచి మాజీ సైనికులు, జిల్లా మాజీ సైనిక సంఘం తరపున పి.విశ్వేశ్వర రావు, పెద్దిరెడ్డి, ఇండియన్ ఆర్మీ తరపున సికంద్రాబాద్ నుంచి ఈఎంఈ రెజిమెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జాకబ్, 9 మద్రాస్, 26 ఆర్ఆర్, ఎఒసీ, ఎన్‌సిసి రెజిమెంట్స్ ఆర్మీ అధికారులు, జవాన్లు, స్థానిక నాయకులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, వందల సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



జవాను పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

హిందూపురం పట్టణంలో చిన్నపిల్లల్ని బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. చిన్నారులపై వరుసగా జరుగుతున్న కుక్కల దాడులే దీనికి కారణం. కుక్కల్ని నియంత్రించాల్సిన పురపాలక సంస్థ పాలకవర్గం, అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నదే తప్ప నివారణ చర్యలు మాత్రం శూన్యం. రోడ్లపై తిరుగుతున్న కుక్కలతో చిన్నారులు బయటకు రావాలంటే భయం భయంగా ఉంటోంది. రాత్రిల్లు కుక్కలు చేసే అరుపులకు ప్రజలకు నిద్ర పట్టక విసిగెత్తి పోతున్నారు. జిల్లా ప్రభుత్వ అసుపత్రి లెక్కల మేరకు ఈ సంవత్సరం జూన్ నుంచి పరిశీలన చేస్తే జూన్‌లో 601, జూలైలో 617, ఆగష్టులో 664, సెప్టంబర్‌లో 637, అక్టోబర్‌లో 771, నవంబర్‌లో 830 మంది కుక్కల కాటుకు గూరైనట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది చిన్నారులే కావడం గమనార్హం.



కుక్కలు బాబోయ్.. కుక్కలు..!

ప్రజాశక్తి-హిందూపురం

కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు నెత్తినోరు కొట్టుకుంటున్నా సమస్య పరిష్కారం కావటం లేదు. నెలకు సరాసరి 600 మందిపై కుక్కలు దాడి చేస్తున్నప్పటికీ చర్యలు మాత్రం కనిపించడం లేదు. గతంలో పురపాలక సంఘంలో కుక్కలను పడుతున్నట్లు హడవుడి చేశారు. పట్టుకున్న కుక్కల్ని మళ్లీ వదిలిపెట్టారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. పిల్లల వెంటపడుతున్నా వీధి కుక్కులు వారిని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. లేకపోతే ఐదారు కుక్కలు ఒకేసారి దాడికి పాల్పడితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. ఈ ఘటనలపై బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధర్మపురంలో ఓ వీధిలో తిరుగుతున్న వీది కుక్కలు

వీధుల్లో స్వైర విహారం

వీధికుక్కల సమస్యపై ప్రజలు ఎప్పటికప్పుడు పురపాలక సంస్థ యంత్రాంగానికి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే గానీ శాశ్వత నివారణకు ప్రయత్నించటం లేదు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించటం ద్వారా వాటి సంతతి పెరగకుండా నిరోధించాల్సి ఉంది. వాటికి ఎప్పటికప్పుడు టీకాలు వేయటం తప్పనిసరి. ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవటంతో ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ సరిగా జరగటం లేదు. నియంత్రణ లేక పోవడంతో కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి.

కేసులు పెడుతున్న జంతు ప్రేమికులు

వీధికుక్కల సమస్యలపై పలు మార్లు కౌన్సిల్ సమయంలో టిడిపి, వైసిపి కౌనిలర్లు సమస్యను అధికారులకు వివరించారు. ప్రజారోగ్య అధికారులు అప్పటికప్పుడు వివరణ ఇవ్వడమే గానీ, తర్వాత శస్త్రచికిత్సలు, ఏబీసీ కేంద్రం నిర్వహణ గురించి పూర్తిగా గాలికొదిలేశారు. వీధికుక్కలను పట్టుకోవటంపై కొందరు జంతు ప్రేమికులు కేసులు పెడుతున్నారు. పురపాలక సిబ్బంది పట్టుకునే సమయంలో గాయాలవుతున్నాయని వారి ఆరోపణ ఉంది. ఇలాంటి కేసుల్ని సాకుగా చూపి యంత్రాంగం మాకెందుకు అన్నట్లుగా వ్యవహరిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

పట్టణ వ్యాప్తంగా కుక్కల సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయి. త్వరలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పట్టణంలో ఉన్న కుక్కలను పట్టి వాటికి శస్త్ర చికిత్సలను చేయిస్తాం. కుక్కలను పట్టణానికి దూరంగా వదిలేందుకు చర్యలు తీసుకుంటాం.

సంఘం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్.

అంగన్వాడీ కేంద్రం నిర్వహణ భేష్

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్, గోరంట్ల

మండలంలోని పాలసముద్రం అంగన్వాడీ కేంద్రం నిర్వహణ బాగుందని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి కితాబునిచ్చారు. ఆయన గురువారం పాలసముద్రం అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి కేంద్రం, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, చిన్నారుల సామర్థ్యం, తదితర అంశాల్లో చక్కగా నిర్విహిస్తున్నారని సూపర్‌వైజర్ రజిత, అంగన్వాడీ వర్కర్ సుభద్ర పని తీరును మెచ్చుకున్నారు. జిల్లా అంతటా ఇదే విధానం అమలు చేయాలని ఆదేశించారు. అంతకుముందు ఆయనకు చిన్నారులు గులాబీ పూలు అందిస్తూ స్వాగతం పలికారు. ఆయనకు సూపర్‌వైజర్ రజిత కొండసాని తాను స్వయంగా రచించిన బాలల గేయాలు, కథల పుస్తకాలను బహూకరించారు. చిన్ని చిన్ని పదాలతో చిన్నారుల చేత చదివించగలిగిన గేయాలు, కథలు రాయడం బాగుందని అభినందించారు. అనంతరం మల్లాపల్లి జడ్పీ హైస్కూల్ వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. గోరంట్ల పట్టణంలోని చౌకబియ్యం గోదాముకు వెళ్లి స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ షాపులకు పంపిణీ చేసే స్టాక్‌ను సరిగా తూకాలు వేసి పంపించాలని ఆదేశించారు. హమాలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.



అంగన్వాడీ సెంటర్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషనర్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



భార్య సుజాత, కుమారుడు నాగచైతన్యతో సురేష్



బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ కమార్తె రాహిత్య

క్షణికావేశం..!

- పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం
- తల్లీకుమారుడు మృతి
- చావుబతుకుల మధ్య కుమార్తె
- కుటుంబ కలహాలే ఘటనకు కారణం..?

అల్లారుముద్దుగా పెంచిన పిల్లలకు ఆ అమ్మే ఊజిమాత్రలిచ్చి ఊపిరి తీయాలనుకుంది. తనకొచ్చిన సమస్యను పరిష్కరించుకోలేక ఆత్మహత్యే మార్గం అనుకుంది. తనతో పాటు తనపిల్లల్నీ తీసుకెళ్లాలనే అనాలోచిత నిర్ణయం తీసుకుంది. కాసేపు ఓపికతో ఆలోచించే ప్రయత్నం చేయకుండా ఆత్మహత్యే శరణ్యం అనుకుంది. కాసింత కష్టానికే తనవుచాలించేంత పెద్ద నిర్ణయం తీసుకుని కుటుంబాన్ని మొత్తం చీకటిమయం చేసింది. ఓ ఇల్లాలు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబంలో పెనువిషాదాన్ని మిగిల్చింది. గురువారం నాడు గార్లదిన్నె మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో తల్లి సుజాత(38), కుమారుడు నాగచైతన్య(12) మరణించగా, చావుబతుకుల మధ్య కుమార్తె రాహిత్య బెంగుళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. ప్రజాశక్తి-గార్లదిన్నె

వార్త మెయిన్‌లో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - నంబులపూలకుంట

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈవోఆర్డీ మాధవరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎఎన్ఎంలకు సూచించారు. గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు చేయించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుండి అందే సాయం వారికి అందే విధంగా చూడాలని సూచించారు. నూతన పింఛన్లు, గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో సర్పంచుల పాత్ర ప్రధానమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దిల్షాద్, అంజనమ్మ తదితరులతో పాటు ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-రొద్దం

టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చెరుకూరు గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సేంద్రియ ఎరువుల తయారీ, వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి భూముల సంరక్షణ, గ్రామ ఉమ్మడి వనరులైన నీటి కుంటల మరమ్మతులు, పూడికతీత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ కో ఆర్డినేటర్ సన్నప్పయ్య, మండల కార్యకర్త సునందమ్మ, సిఆర్‌పిలు హరీష్, నాగరాజు పాల్గొన్నారు.



ఎరువుల తయారీని చేసి చూపిస్తున్న టింబక్టు సభ్యులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పాత్రికేయులపై దాడి హేయం

ప్రజాశక్తి-పెనుకొండ

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సినీ నటుడు మోహన్ బాబుని తక్షణం అరెస్టు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణం లోని సిపిఎం కార్యాల యంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాత్రికేయుడిపై మోహన్‌బాబు దాడి చేయడం శోచనీయమన్నారు. జర్నలిస్టులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకువచ్చి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కన్వీనర్ బాబావలి, నాయకులు మహబూబ్ బాషా, గంగాధర్, తిప్పన్న, రాజురావు పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-రొద్దం

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఆ పార్టీ పెనుకొండ నియోజకవర్గం సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను జగన్‌కు వివరించారు. జగన్‌ను కలిసిన వారిలో నాయకులు బి.నారాయణరెడ్డి, రాజారెడ్డి, కలిపి శీన, మారుతిరెడ్డి, బుల్లెట్ బాబు ఉన్నారు.



వైసిపిఅధినేత జగన్‌ను కలిసిన నాయకులు

ప్రభుత్వాసుపత్రికి టూల్ కిట్ అందజేత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ ఆసుపత్రికి టూల్‌కిట్‌ను అందజేసింది. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్‌కు ఛైర్మన్ తల్లం నారాయణమూర్తి, కార్యదర్శి మంజునాథ్ టూల్‌కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్, కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులకు, వివిధ మరమ్మతులకు ఈ టూల్ కిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మున్ముందు ప్రభుత్వ ఆసుపత్రికి మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్.మాధవి, సంస్థ సభ్యులు పెద్దకోట్ల రవికుమార్, గట్టు వెంకటేశులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సదస్సులు

ప్రజాశక్తి-పెనుకొండ

రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ శ్రీధర్ తెలిపారు. మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వన్-బి, అడంగల్, భూముల సబ్ డివిజన్, పింఛన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్ తదితర సమస్యలను ప్రజలు వివరించారు. సదస్సులో ఆర్ఐ భాస్కర్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో తేజ, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, గోపాల్‌నాయక్, షేక్షావలి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ, రామాంజనేయులు, బూత్ కన్వీనర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీధర్

మత సామరస్యానికి ప్రతీక బాబయ్యస్వామి దర్గా


నేడు గంధం మహోత్సవం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీబాబయ్యస్వామి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఏటా బాబయ్యస్వామి ఉరుసును రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం 752వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ప్రధాన ఘట్టమైన గంధం పూజతో ప్రారంభమవుతాయి. 14వ తేదీ దీపారాధన, 15న ఫకీర్ల ప్రదర్శన, 16న ధూలి పరుస, 17న ఖాజా సయ్యద్‌షా మస్తాన్ హూసేన్ గంధం పూజ, 18న సయ్యద్ బీదర్‌షావలి గంధం పూజ, 19న ఆర్మాన్ కార్యక్రమాలు ఉంటాయి. గంధం రోజు రాత్రి ఖవాలీ మందిరం సమీపంలో ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెమినార్(సర్వమత సమ్మేళనం) నిర్వహిస్తారు. ప్రభుత్వం తరపున మంత్రి సవిత శ్రీబాబయ్యస్వామికి చాదర్ సమర్పిస్తారు. ముఖ్య అతిథులుగా మంత్రి ఫారుక్, ఎంపి బికె.పార్థసారధి, మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, తదితరులు హాజరవుతారు.

శ్రీబాబయ్యస్వామి చరిత్ర..

బాబాఫకృద్దీన్ జన్మస్థలం ఇరాన్ దేశంలోని శిస్థాన్ పట్టణం. ఈయన రాజ్యపాలన చేస్తున్న సమ యంలో ఓ రోజు న్యాయం కోసం వచ్చిన బాధితులను నిర్లక్ష్యం చేస్తారు. ఆ తప్పునకు పశ్చాత్తాపంగా మత గురువుల ఆదేశానుసారం రాజ్యాన్ని త్యజించి దేశాటనకు వెళ్లారు. దేశ, విదేశాలు తిరిగి తమిళనాడులోని తిరుచనాపల్లికి వస్తారు. అక్కడ హజ్రత్ సత్తేహార్ తబ్రే ఆలం బాద్‌షాను గురువుగా స్వీకరిస్తారు. పెనుకొండకు వెళ్లి సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యం గురించి ప్రజలకు బోధించాలని ఆజ్ఞాపిస్తారు. అయితే పెనుకొండ ఎక్కడుందో తెలీదని బాబా చెప్పగా గురువు దంతాలు తోముకుంటున్న కట్టిపుల్లను ఇస్తారు. దేశ సంచారం చేస్తూ రాత్రిపూట నిద్రించే స్థలంలో ఈ పుల్లను భూమిలో నాటు, మరుసటి రోజు ఆ పుల్ల చిగురిస్తే అదే నీకు స్థిర నివాసమని ఉపదేశిస్తారు. బాబా దేశాటన చేస్తూ కర్నాటక, తమిళనాడు లో పలు ప్రాంతాలు తిరిగారు. ఈ క్రమంలో పెనుకొండకు చేరుకుని కోట బయట తూర్పున ఉన్న మండపంలో బస చేస్తారు. రాత్రి నిద్రించే సమయంలో వెంట తెచ్చుకున్న పుల్లను భూమి లో నాటి ఉదయం లేచి చూడగా పుల్ల చిగురించి ఉండటాన్ని గమనిస్తారు. దీంతో ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన ఇక్కడ ఉండటానికి హిందూ మత పెద్దలు వ్యతిరేకిస్తారు. ఈ విషయం రాజు దృష్టికి వెళ్లడంతో బాబాకు హిందూ మతపెద్దలకు మధ్య పోటీ నిర్వహిస్తారు. ఈ పోటీలో బాబాయ్య స్వామి విజయం సాధించి మండపాన్ని స్థిర నివాసంగా పొందుతారు. ప్రతి రోజూ మత సామరస్యంగా తన మహిమలను చూపుతారు. దీర్ఘకాలిక రోగాలను నయం చేసి ప్రజల్లో నమ్మకం పొందారు. దీంతో హిందూవులు సైతం బాబాయ్య స్వామిని కొలిచేవారు. బాబయ్య స్వామిగా ఖ్యాతి పొందిన బాబాఫకృద్దీన్ క్రీ.శ 694లో పరమపదించారు. ఆ స్థలంలోనే బాబాను సమాధి చేశారు. ఆయన సమాధే ప్రఖ్యాతి చెందిన శ్రీబాబయ్యస్వామి దర్గా.





దర్గా పీఠాధిపతి తాజ్‌బాబాస్వామి

ప్రజాశక్తి
www.prajasakti.com

ఈవోఆర్డీగా శివకుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల ఈవోఆర్డీగా శివకుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో కలిసి శివకుమార్ మండల అభివృద్ధి అధికారిణి సరస్వతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన బేకరీ గంగాధర్‌ను టిడిపి, ఎంఆర్‌పిఎస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోనిసాయి ఆరామం ఫంక్షన్ హాల్ లో టిడిపి, ఎస్సీ సెల్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఇఎఫ్ నాయకులు బేకరీ గంగాధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఆశీస్సులతో డైరెక్టర్ నియామకం జరగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, రామాంజనేయులు, యశోద రాయుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు రంగప్ప, ఫోటో సాయి, కుళ్లాయప్ప, పలక రామాంజనేయులు, నాగార్జున, రామయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డు సమీపంలో జనవరి 6, 7వ తేదీల్లో జరగనున్న ఇస్తేమాకు సంబందించిన స్థలాన్ని మత పెద్దలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర గురువారం పరిశీలించారు. ముస్లింలు పవిత్రంగా నిర్వహించే ఇస్తేమాకు ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని సురేంద్ర మత పెద్దలతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ జేవీ అనిల్ కుమార్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పేద మహిళలకు ఆర్డీవో చేతుల మీదుగా కుట్టుమిషన్లను గురువారం పంపిణీ చేశారు. పుట్టపర్తికి చెందిన కిద్మత్ ఏ కల్క్ సహకారంతో శ్రీ సత్య సాయి జిల్లా కోడూరు గ్రామానికి చెందిన నందని, పుట్టపర్తి పట్టణంలో బ్రాహ్మణపల్లికి చెందిన షబానాను వీటిని పంపిణీ చేశారు. వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేని కారణంగా కుటుంబ పోషణకు ఆర్థిక చేయూత అందించడానికి ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ షామీర్ స్పందించి కుట్టు మిషన్లను పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ చేతుల మీదుగా కార్యాలయంలో గురువారం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షాకీర్, రామాంజి, షమీవుల్లా, జావిద్, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకపోతే జీవనం ఎలా..!

సమస్యలు పరిష్కరించకపోతే 20 నుంచి సమ్మెలోకి
ధర్నాలో పారిశుద్ధ్యకార్మికులు



కమిషనర్‌ఛాంబర్ ముందు ధర్నాలో పారిశుధ్య కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని...వేతనాలు ఇవ్వక పోతే జీవనం ఎలా చేయాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులును పారిశుధ్య కార్మికులు ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, సకాలంలో కార్మికులకు పని ముట్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాము, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లి కార్జున, ఆనంద్ మాట్లాడుతు పురపాలక సంఘాన్నే నమ్ముకుని గత 25 సంవత్సరాలుగ దళిత కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా కార్మికుల తలరాతలు మారడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఆరు నెలలుగా కార్మికులకు ఇచ్చే అర కొర వేతనాలు కూడా ప్రతి నెల ఇవ్వడం లేదన్నారు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణం దృష్ట్యా కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉన్నప్పటికి ఉన్న కార్మికులతోనే అదనంగా పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అవసరమైన పని ముట్లు, కార్మికులకు రక్షణ పరికరాలు సైతం ఇవ్వడం లేదన్నారు. 85 మంది అదనపు కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. గడచిన మూడు సంవత్సరాల్లో 10 మంది పారిశుద్ధ్య కార్మికులు విశ్రాంతి తీసుకున్నారని ఇప్పటి వరకు వారి కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ వరదల సమయంలో అక్కడ విధులు నిర్వహించిన కార్మికులకు రెండు జతల బట్టలు, రూ.1500 వేతనం ఇవ్వాలని ప్రభుత్వం సర్కులర్ ఇచ్చినప్పటికి హిందూపురం పురపాలక సంఘంలో అమలు చేయలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత సంవత్సరం డిసెంబర్ నెలలో 16రోజుల పాటు చేసిన సమ్మె చేస్తే ఆ సమయంలో ప్రతి పక్షంలో ఉన్ను వారు గొప్పగ సమ్మె శిబిరాలకు వచ్చి మద్దతు తెలిపి, న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని చెప్పారన్నారు. అయితే వారే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినప్పటికికార్మిక సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైన సమస్యలను పరిష్కరించక పోతే ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిని కమిషనర్‌కు అందజేశారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతు కొంత మంది కార్మికులకు మూడు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉందని, వారికి మూడు రోజుల్లో వారికి చెల్లిస్తామని అన్నారు. పని ముట్ల విషయంలో గతంలో టెండర్ తీసుకున్న గుత్తేదారుడు పని ముట్లు సరఫరా చేయలేదని, వెంటనే టెండర్ నిర్వహించి, అందరికి పనిముట్లతో పాటు కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందిస్తామన్నారు. దీంతో పాటు కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామచంద్ర, బాబయ్య, చంద్ర, రామంజప్ప, రమేష్, కవితమ్మ, సుబ్బలమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ :మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెవి. రమణ, టీ అయుబ్ ఖాన్, ఎస్ వెంకటేష్, ఎం. బాబు , ముకుంద మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ అదనపు కార్మికులకు, మున్సిపల్ పాఠశాలల ఆయాలకు పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశ్యారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలు వెంటనే అమలు చేయాలన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. అదనపు కార్మికులకు ఆప్కాస్ కార్మికులుగా గుర్తించి ఆప్కాస్ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శానిటేషన్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ ఓబులేసు, ప్రసాద్, కేశవ, పెద్దక్క, సాలమ్మ, ముత్యాలమ్మ, ఓలప్ప, అదనపు కార్మిక సంఘం కార్మికులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్. వెంకటేష్



కొత్తచెరువులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఓడిసిలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. కొత్త చెరువులోని విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ వివిధ రూపాల్లో పెంచిన విద్యుత్‌ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియకు స్వస్తి పలకాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు ఆదానితో జరిగిన ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు టిడిపి వారు బాదుడే బాదుడని ఆందోళనలు చేశారని గుర్తు చేశ్యారు. తాము అధికారంలోకి వస్తే వీటిని పెంచబోమని గతంలో హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు వాటిని మరిచి సర్దుబాటు ఛార్జీల పేరుతో 6072 కోట్ల రూపాయలు ప్రజల పైన భారం వేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. 2023 - 24 సంవత్సరానికి 11826 కోట్లు రూపాయలను వసూలు చేయాలని ఆ శాఖ మంత్రి ప్రకటించడం బాధాకరమన్నారు. అనంతరం విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బాళ్ల అంజి, మండల కార్యదర్శి ముత్యాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, శ్రావణి ,బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు వివి రమణ, మండల కార్యదర్శి కుల్లాయప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆంజనేయ గుడి ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు , విద్యుత్ డ్యూటీ తదితర వాటి పేరిట ఇష్టానుసారంగా విద్యుత్‌భారాన్ని మోపారన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ విద్యుత్ బిల్లులను ఈసందర్భంగా తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రమణ, వెంకట రంగారెడ్డి, మనోజ్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం

విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకోలో విద్యార్థులు, నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల నందు ప్రతిరోజు పురుగుల అన్నంతో పెడుతున్నారని మెనూ ప్రకారం సక్రమంగా అన్నం పెట్టలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ కదిరి అనంతపురం రహదారిపై విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎఐఎస్‌పి సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈసందర్భంగా విద్యార్థిసంఘం నాయకులు నరసింహ మాట్లాడుతూ కదిరి పట్టణం డిగ్రీ కళాశాల పక్కన ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారన్నారు. మెనూ పాటించడం లేదన్నారు. విద్యార్థులంటే ప్రిన్సిపల్‌కు చులకన భావం ఏర్పడిందని ఆరోపించారు. విద్యార్థులకు సరైన భోజనం అందించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌పి నాయకులు అవినాష్, ప్రదీప్, పృథ్వీ, రాకేష్, కిరణ్,సాయి కుమార్, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని గౌనిపల్లి, ఒడిసిలో ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి గురువారం పర్యటించారు. గౌనిపల్లి హైస్కూల్లో మధ్యాహ్నభోజన పథకం పనితీరును పరిశీలించారు ఆ తర్వాత స్టాకును పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ పరిశీలించారు. చిన్న పిల్లలతో ముచ్చటించారు. ఒడిసి కస్తూరిబాయ్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సురేష్, రమణ, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, సూపర్ వైజర్ విజయ కుమారి, అంగన్వాడీలు షమీం, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ : గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. మల్లెల రమేష్ మిత్రుల సహకారంతో దాదాపుగా 300 మందికి నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిష్టప్ప, మండల విద్యాధికారులు సురేష్ బాబు, రమణ, ఐసిడిఎస్ పేఈడీ వరలక్ష్మి, సూపర్వైజర్ విజయకుమారి ,ప్రధాన ఉపాధ్యాయుల మహమ్మద్ రియాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నల్లచెరువు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పి.కొత్తపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో అధికారులు పాత్ర పారదర్శకంగా ఉండాలని సూచించారు. అర్హులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సన్యాసిరావు, తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రఘునాథ గుప్తా, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వోలు, ఆయా శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం : వైసిపి



ధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి దీపిక వేణురెడ్డి విమర్శించారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో రైతు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, మండల,వార్డు సభ్యులు కన్వీనర్లు, నాయకులు జబీవుల్లా, శివ, షాజియా, చాంద్‌బాషా, రాము, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, లేపాక్షి నిసార్ అహ్మద్, మనోజ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వైసీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. గణేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకొని అక్కడ నిరసన తెలపడం జరుగుతుందన్నారు. రైతు సమస్యలపై కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాలో వైసిపి శ్రేణులు, నాయకులు, రైతులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ కాంట్రాక్టర్ దారుణ హత్య

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు సమీపంలోనే మైలేపల్లి చెరువు రైల్వే ట్రాక్ పక్కన ఉన్న పొలం వద్ద విద్యుత్తు కాంట్రాక్టర్ దారుణహత్యకు గురయ్యాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలు... నల్లమాడ మండలం బుగ్గలపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రాజశేఖర్(50) కొత్తచెరువు మండలంలో విద్యుత్తు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సమీపంలోని ఫామ్‌హౌస్‌లో అద్దెకు తీసుకొని గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ ఉంటూ పనులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో పదిమంది గుర్తుతెలియని వ్యక్తులు ఫామ్ హౌస్‌లో నిద్రిస్తున్న రాజశేఖర్‌ను వాహనంలో ఎత్తుకెళ్లారు. ఇనుప రాడ్డులతో కొట్టి చంపివేసి తిరిగి ఫామ్ హౌస్ వద్ద రాజశేఖర్ మృతదేహాన్ని పడేసి వెళ్లారు. రాజశేఖర్‌తో పాటు ఫాంహౌస్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోయి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తచెరువు అప్ గ్రేడ్ సిఐ ఇందిరా, పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించారు. హత్య జరిగిన తీరుని పరిశీలించారు. మృతుడికి ఒక మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది. వారే ఈ హత్యకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు రాజశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కర్నాటక వాసి మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నాటక ప్రాంతానికి చెందిన మహిళ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... కర్ణాటక రాష్ట్రం దొడ్డబల్లాపూర్ కు చెందిన నాగమణి(46) ఆమె భర్త సోమశేఖర్ గురువారం శుభకార్యం నిమిత్తం దొడ్డబల్లాపురం నుంచి ధర్మవరం ఇందిరమ్మ కాలనీకి వచ్చారు. అక్కడ నుంచి ద్విచక్ర వాహనంలో ధర్మవరం టౌన్ తొగట వీధికి వస్తూ ఉండగా పట్టణంలో కళాజ్యోతి సర్కిల్ మలుపు వద్ద ధర్మవరం బస్టాండ్ వైపు నుండి ఎన్టీఆర్ సర్కిల్ వైపునకు వెళ్లే ఒక లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. సోమశేఖర్ స్వల్ప గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన నాగమణిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మవరం వాసులకు జాతీయ సమైక్యత అవార్డు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జాతీయ సమైక్యత అవార్డులకు ధర్మవరం వాసులు ఎంపికయ్యారు. పెనుకొండ దర్గా కమిటీ వారు జాతీయ సమైక్యత అవార్డుకు ధర్మవరం పట్టణానికి చెందిన జయసింహ, పోలా ప్రభాకర్, నరేందర్ రెడ్డిని ఎంపిక చేసిందనిసౌత్ ఇండియా స్వచ్ఛంద సంస్థల కార్యకర్త, రెడ్ క్రాస్ కోశాధికారి, ధర్మవరం నియోజకవర్గ రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ఈ ముగ్గురితోపాటు సోమల రాజు ఫౌండేషన్ అధినేత శివరాజు కూడా అవార్డుకు ఎంపిక అయ్యారని చెప్పారు. అదేవిధంగా జిల్లా రచయితల సంఘం ద్వారా, స్వచ్ఛంద సంస్థల ద్వారా హిందూ పురానికి చెందిన ఉమర్, కదిరి బాబా ఫక్రుద్దీన్ లు సాహిత్య రంగంలో చేసిన సేవలు అభినందనీయమని వారిని కూడా అవార్డుకు ఎంపిక చేయడం హర్షనీయమని చెప్పారు. వీరు ఈనెల 13వ తేదీ పెనుకొండలో అవార్డులను అందుకుంటారని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి ముదిగుబ్బ

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని తహశీల్దార్ నారాయణస్వామి కోరారు. మండల పరిధిలోని సానువారిపల్లి గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించి గ్రామ అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం సూర్య ఘర్ పథకం (రూఫ్ టాప్ సోలార్)విద్యుత్ వినియోగదారులకు వరం లాంటిదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓ. శివరాం పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి లోని సాయి ఆరామం లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో శివరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సహకారంతో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం వలన విద్యుత్ వినియోగదారులకు మేలు జరగడమే కాకుండా, ఆర్థికంగా కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్ల పైన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ ఆదా అవుతుందని, అంతేకాకుండా ఇదివరకు వస్తున్న వేలాది రూపాయల బిల్లు వందల్లోకి తగ్గిపోవడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం బ్యాంకులు తమ వంతు సహకారం అందిస్తున్నాయని ఆయన వివరించారు. వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్ల ప్రదర్శనను వినియోగదారులు తిలకించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పుట్టపర్తి టౌన్ లోను వివిధ కాలనీలలో ముఖ్యంగా ప్రశాంతి గ్రామ్, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, పెడబల్లి మామిళ్ళకుంట క్రాస్ నందు ఇంటింటికి విద్యుత్ సిబ్బంది వెళ్లి రూఫ్ టాప్ సోలార్ పథకం ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ లు శరవనన్, నరసింహారెడ్డి, ఎఇలు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌రాజ్‌కు గద్దర్ జాతీయ సేవా పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా పనిచేస్తున్న సునీల్ రాజ్‌కు గద్దర్ జాతీయ సేవా పురస్కారం లభించింది. మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గద్దర్ జాతీయ సేవా పురస్కారాలకు తెలుగు ఉమ్మడి రాష్ట్రాలనుండి కవులు, సామాజిక సేవాకర్తలను ఎంపిక చేసి ఈ వేదికలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వెన్నెల (స్వర్గీయ గద్దర్ కుమార్తె) తెలంగాణ సాంస్కృతికకల్చరల్ అకాడమీ డైరెక్టర్ గిడ్డి సత్యనారాయణ, పి. గన్నవరం శాసన సభ్యులు, కె. చక్రవర్తి, మమతా స్వచ్ఛంద సేవ సమితి వ్యవస్థాపకులు కోరుకొండ జాన్ పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో వెన్నెల మాట్లాడుతూ గద్దర్ తన పాటలు, నాట్యంతో తెలుగు ఉమ్మడి రాష్ట్రాలలో పేదరికం నిర్మూలన కోసం ఏ విధంగా ప్రజలను చైతన్యపరిచారో వివరించారు. అనంతరం సునీల్ రాజ్ ను శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కాగా వత్తి, ప్రవృతికి సమన్యాయం చేస్తూ, ఈ అవార్డు తెచ్చుకోవడం ఎంతో గర్వకారణమని స్థానిక మున్సిపల్ ఉద్యోగులు సునీల్ రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యలో నైతిక విలువల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

విద్యలో నైతిక విలువల ప్రాముఖ్యత అనే కార్యక్రమంపై అవగాహన సదస్సును స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యమ్రంలో బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు భగవాన్ భాయ్ , రాధా సిస్టర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు నైతిక విలువలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. నైతిక విలువలు జీవితంలో అన్ని నిర్ణయాలకు మార్గం సుగమం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

చెరువు ఆయకట్టు కాలువ మరమ్మతులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

చెరువు ఆయకట్టు కింద ఉన్న కాలువ పూడికతీత పనులను గురువారం చేపట్టారు. ఈ పనులను టిడిపి నాయకులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు, పరిటాల శ్రీరామ్ తన సొంత నిధులతో జెసిబిలను ఏర్పాటు చేసి ఆయకట్టు కింద ఉన్న ప్రతి కాలువలోనూ పూడిక తీత పనులు చేపట్టారు. తుంగసేను కాలువ, రాగి కాలువ, ముక్కంటి తూము కాలువలు, గోరకాలవ, పెద్ద కాలువలోగల పూడికలను జెసిబిల ద్వారా తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ నాయకులు శ్రీశైలం పురుషోత్తం గౌడ్, పరిసే సుధాకర్, మాధవ రెడ్డి, రూరల్ నాయకులు మహేష్ చౌదరి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

కదిరి అర్బన్ : సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని పంపితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ నారాయణ రెడ్డి హెచ్చరించారు. మొబైల్ ఇవ్వనందుకు తల్లిపై కత్తితో దాడి చేశారని తప్పుడు వార్త గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ సమాచారంపై పట్టణ సిఐ నారాయణ రెడ్డి స్పందించారు. కదిరిలో అలాంటి సంఘటనలు ఎక్కడ జరగలేదని ఆయన పరిశీలనలో తేలింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారం తప్పుడు సమాచారాన్ని పార్వర్డ్ చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.